
డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని క్రాంతి యువజన సంఘం వద్ద రూ.25లక్షలతో చేపడుతున్న నూతన డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా తన ఆరోగ్యం బాగలేకున్నా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులతో ప్రతినిత్యం ఫోన్లో మాట్లాడడం జరుగుతుందన్నారు. ఎల్బీనగర్ ప్రజల ఆశీస్సులు, ప్రేమానురాగాలతో తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానన్నారు. ఇకనుంచి ప్రతినిత్యం ప్రజలకు సేవ చేయడానికి, ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముప్వ సతీష్‌చౌదరి, నాయకులు అనిల్ చౌదరి, ముద్దగౌని సుమన్‌గౌడ్, సతీష్‌గౌడ్, మనోజ్‌కుమార్, శివశంకర్, శ్రీశైలం, జగన్‌మోహన్, పారంద స్వామి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట్‌లోని ఇందిరాగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 163మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. రూ.1కోటి 63 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలను కలిసిన ఆర్‌కేపురం కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లవంటివి : కేఎల్ఆర్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లవంటివని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్‌కాలనీ, శ్రీరామకృష్ణాపురం, అల్కాపురికాలనీ, ద్వారకానగర్‌కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు తమ కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ సంఘాల భవనాలు, మహిళా మండలి భవనాలు, సీనియర్ సిటిజన్స్ భవనాలతో పాటు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. స్పందించిన కేఎల్ఆర్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో అన్ని సమస్యలు శాశ్వతంగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ ఆలయం చైర్మన్ కుంచారపు సురేష్‌కుమార్, యాదవరెడ్డి, పెద్దపూర సైదులు, కాలనీ ప్రతినిధులు సంజీవరెడ్డి, రామారావు, వంశీ, శ్రీనివాస్, విజయలక్ష్మి, సుబ్బారావు, మధు, కృష్ణయ్య, సైదయ్య, కృష్ణరెడ్డి, వెంకటేశ్వర్లు, అనుపమ గోపాల్, శ్యామలాదేవి, మాధవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి, రవిముదిరాజ్

ప్రొటోకాల్ పాటించని కార్పొరేటర్‌కు తగిన బుద్ధి చెబుతాం : బీఆర్ఎస్ నేతలు

చంపాపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి సమాచారం ఇవ్వకుండా డివిజన్‌లో ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న బీజేపీ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్‌లో శనివారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ఎల్బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, సీనియర్ నాయకులు సదానంద్‌రెడ్డి, అంజిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చంపాపేట డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలలో ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహిస్తుండడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు కార్పొరేటర్ ఇలాగే ప్రవర్తిస్తే కార్యక్రమాలను అడ్డుకోనున్నట్లు వారన్నారు. సమావేశంలో హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ గోగిరెడ్డి అంజిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు సదానంద్‌రెడ్డి, రేజారెడ్డి, గోగు శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, వసంత, రమాదేవి, చేగోని మల్లేష్‌గౌడ్, జంగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయ కమిటీ కార్యవర్గం


కట్ట మైసమ్మ ఆలయ కమిటీ నూతన చైర్మన్ హనుమంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చంపాపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సుభాష్‌చంద్రబోస్‌కాలనీ సుబేదార్ మార్గ్‌లోని కట్ట మైసమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి హనుమంత్‌గౌడ్, వైస్ చైర్మన్లుగా మంద జయన్న, బత్తిన సుధాకర్, కార్యదర్శులుగా ఏ.జైపాల్, ఏ.నర్సింహ, కమిటీ సభ్యులుగా మంద నర్సింహ, బలరాం తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్ హనుమంత్‌గౌడ్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.

మా ఇళ్లు మాకే కావాలి

● తహసీల్దార్‌ను నిలదీసిన కర్మన్‌ఘాట్ ఫేజ్-3 లబ్ధిదారులు


సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం కర్మన్‌ఘాట్ ఫేజ్-3 లబ్ధిదారులు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మా ఇళ్లు మాకే కావాలి... ఎప్పుడు ఇస్తారో చెప్పాలంటూ జేఎన్ఎన్‌యూఆర్ఎం కర్మన్‌ఘాట్ ఫేజ్-3 లబ్ధిదారులు తహసీల్దార్‌ను నిలదీశారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కర్మన్‌ఘాట్ ఫేజ్-3 లబ్ధిదారులు శనివారం కొత్తపేట చౌరస్తా నుంచి ప్రదర్శనగా సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఆందోళనకారులు ఒక దశలో సరూర్‌నగర్ ప్రధాన రహదారిపైకి చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో వారు కార్యాలయం ఆవరణకు వచ్చి నినాదాలు చేశారు. తహసీల్దార్ వచ్చి తమకు ఇళ్లు ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని పట్టుపట్టారు. ఈ రోజు కబ్జాదారులను ఖాళీ చేయిస్తామని చెప్పి మాటతప్పారని వారు మండిపడ్డారు. తక్షణమే కబ్జాదారులను ఖాళీ చేయించి మా ఇళ్లను మాకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో తాము ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే విచారణ చేపట్టి 512 మంది అర్హులను డబ్బు కట్టమంటే అందరం దాదాపు రూ. 4,10,88,000 జమ చేశామని చెప్పారు. అధికారుల చుట్టూ తిరుగగా 2018లో తమకు నందనవనంలో ఇళ్లను కేటాయించారని వారు తెలిపారు. 2019లో సంతోషంగా గృహప్రవేశాలు చేసుకుందామని అక్కడికి వెళ్లగా వేరేవాళ్లు మా ఇళ్లను కబ్జా చేశారని గుర్తించామన్నారు. దీంతో నాటి నుంచి తిరగని కార్యాలయమంటూ.. అడుక్కోని అధికారి అంటూ లేరన్నారు. చివరకు 2022లో 427మంది కబ్జాదారులకు వివిధ ప్రాంతాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించారన్నారు. అయినప్పటికీ వారు తమ ఇళ్లను ఖాళీ చేయకుండా అక్కడ డబుల్‌బెడ్‌రూం ఇళ్లతో పాటు తమ ఇళ్లను కూడా అనుభవిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వారిని ఖాళీ చేయించి తమకు ఇళ్లను అప్పగించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశించినా కిందిస్థాయి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ ఇళ్లకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి మాకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు తమ తీరు మార్చుకుని మాకు న్యాయం చేయాలని వారు కోరారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ వేణుగోపాల్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించి వెళ్లిపోయారు.

సమ్మోహనంగా లక్ష్య కూచిపూడి రంగప్రవేశం


నాట్యం చేస్తున్న నర్తకి లక్ష్య రాచప్రోలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నృత్యాంశాలకు వైవిధ్యభరితంగా యువనర్తకి లక్ష్య రాచప్రోలు నర్తించి ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డా.అలేఖ్య పుంజాల శిష్యురాలు లక్ష్య రాచప్రోలు కూచిపూడిలో రంగప్రవేశం చేసింది. త్రిష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నర్తకి లక్ష్య కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ ప్రతిభ ప్రహ్లాద్, మాజీమంత్రి గీతారెడ్డి, హరిచందన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ఆమెను సత్కరించారు. అభినందించారు.

మన్సూరాబాద్‌లో రోడ్డు ఆక్రమణల తొలగింపు


టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆక్రమణలను తొలగింపజేస్తున్న డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య

మన్సూరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాకపోకలకు అడ్డంకిగా ఉన్న రోడ్డు ఆక్రమణలను శనివారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించింది. కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ రోడ్డులో ఇరువైపులా వ్యాపారులు రోడ్డు పక్కన ప్రజల రాకపోకలకు అడ్డంకిగా షెడ్లు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు మన్సూరాబాద్ డివిజన్ కామినేని చౌరస్తా నుంచి నల్లపోచమ్మ ఆలయం వరకు ఆక్రమణల తొలగింపుపై శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన ఆక్రమణలను పోలీసుల బందోబస్తునడుమ జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా డీసీ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తేలా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేపడితే చర్యలు తప్పవని ఆక్రమణదారులను హెచ్చరించారు. రోడ్డుపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తలెత్తేలా అక్రమంగా నిర్మించిన ఆక్రమణలను ఇది వరకే తొలగించామని, అయినా కొందరు పదే పదే ఆక్రమణలు చేపడుతూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్, ఎల్బీనగర్ సర్కిళ్ల అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శాంసన్, ప్రతాప్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అక్బర్, మూడు సర్కిళ్ల చైన్‌మెన్లు, నాక్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

జీఎస్ఐ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం


సత్యనారాయణను సన్మానిస్తున్న జీఎస్ఐ హెచ్ఓడీ సూరజ్ దోమజీ పట్బాజే

మన్సూరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేస్తానని సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సూరజ్ దోమజీ పట్బాజే పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జీఎస్ఐ సంస్థలోని మల్టీపర్పస్ హాల్‌లో జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి మదిర సత్యనారాయణ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ జీఎస్ఐలో రిజర్వేషన్ల రోస్టర్లను సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనంతరం 35ఏళ్లుగా సంస్థ ఉద్యోగిగా, అసోసియేషన్ కార్యదర్శిగా సేవలందించి పదవీ విరమణ చేపట్టనున్న మదిర సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులను సంస్థ హెచ్ఓడీ పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేష్, సంస్థ డీడీజీలు ఎంఎన్ ప్రవీణ్, సత్యనారాయణ, మహాపాత్ర, అజయ్ నిర్వాన్, మారుతి, జాయింట్ డైరెక్టర్ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఫీడర్ ఏర్పాటుతో లో వోల్టేజీ సమస్యకు చెక్

● టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి


11కేవీ శివాలయం ఫీడర్‌ను ప్రారంభిస్తున్న టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం చూపినట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి పేర్కొన్నారు. 33/11కేవీ హనుమాన్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన 11కేవీ శివాలయం ఫీడర్‌ను శనివారం ఎస్ఈ మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో వోల్టేజీ సమస్యతో 33/11కేవీ ఆటోనగర్, హనుమాన్‌నగర్ ఉపకేంద్రాల పరిధిలోని సెంట్రల్‌బ్యాంక్‌కాలనీ, సూర్యోదయకాలనీ, మధురానగర్, హిమపురికాలనీ, ఆటోనగర్ కాలనీల ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. 11కేవీ శివాయం ఫీడర్ ఏర్పాటుతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, విద్యుత్ శాఖ డీఈలు కేకే రామకృష్ణ, తిరుపతయ్య, ఏడీఈలు మధుకిరణ్, విజయ్‌భాస్కర్, ఏఈలు నిఖిల, శంకర్ పాల్గొన్నారు.

జైలు అదాలత్‌లో 35 కేసుల పరిష్కారం

సైదాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నాంపల్లి కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జైలు అదాలత్‌లో 36 కేసులు పరిష్కరించి ఖైదీలకు విముక్తి కలిగించారు. నాంపల్లి క్రిమినల్ సీజీఎం కోర్టు, 1,2,3,4,5,6,7 ఏసీజేఎం కోర్టులకు సంబంధించి 35 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ అజేష్‌కుమార్, న్యాయమూర్తులు రాజేందర్, ఆషారాణి, కుమారస్వామి, స్వర్ణలత, అరుణకుమారి పాల్గొన్నారు.

జైలు క్రీడాకారులకు సన్మానం

సైదాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్ల శాఖ 7వ రాష్ట్రస్థాయి 'ప్రిజన్స్ స్పోర్ట్‌మీట్-2025లో చంచల్‌గూడ జైలు సిబ్బంది, అధికారులు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ఆల్‌రౌండర్ ట్రోఫీ సాధించారు. స్పోర్ట్స్‌మీట్ చంచల్‌గూడలోని సీకా పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 12,13,14వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించారు. వివిధ విభాగాల క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులను శనివారం జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ సన్మానించారు. త్వరలో జరగబోయే ఆల్ ఇండియా ప్రిజన్స్ మీట్‌లో రాష్ట్రం నుంచి అత్యధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

26న బ్యాడ్మింటన్ టోర్నమెంట్

హయత్‌నగర్ : మహాశివరాత్రి రోజున హయత్‌నగర్ పాత రోడ్డులోని ఎస్‌వీఎస్ ఇండోర్ స్టేడియంలో గజ్జి యాదయ్య, రాజమ్మ మెమోరియల్ స్మారక బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గజ్జి నర్సింహయాదవ్ తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి పోటీలు ప్రారంభమై 27వ తేదీ 6.30గంటల వరకు జరుగుతాయని తెలిపారు. రూ.800 ఎంట్రీ ఫీజు చెల్లించి టీం పేరును నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. పోటీల్లో గెలుపొందిన టీంలకు రూ. లక్ష ప్రైజ్‌మనీ, షీల్డు ఉంటుందన్నారు. బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఇతర వివరాల కోసం జీఎన్ యాదవ్-9849956055 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఎంట్రీ ఫీజు ఫోన్ పే నంబర్ కౌశిక్-9959647689 జమ చేయాలన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో నాదర్‌గుల్ విద్యార్థుల ప్రతిభ

● జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం


సహస్ర, ప్రభాస్‌లను అభినందిస్తున్న హెడ్మాస్టర్ సత్తయ్య, సిబ్బంది

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల మేడ్చల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి అందుకున్నారు. ఇక్కడ 8వ తరగతి చదువుతున్న కొణిదేటి సహస్ర, కె.ప్రభాస్ సదరు ఎగ్జిబిషన్‌లో రోడ్డు భద్రత నేపథ్యాన్ని ఎంచుకుని, యూ-టర్న్‌లతో రోడ్డు ప్రమాదాలకు చెక్ అనే అంశంపై ప్రాజెక్టు తయారు చేశారు. దీనిని ప్రదర్శనలో పెట్టి సందర్శకులకు, అతిథులకు చక్కగా వివరించారు. ఎగ్జిబిషన్‌లో న్యాయమూర్తులుగా వ్యవహరించిన ఏబీసీటీ, డీఆర్‌డీవో సైంటిస్టులు వారి ఎగ్జిబిట్‌ను ప్రథమ స్థానానికి ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 23ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌లో తమ అంశాలను ప్రదర్శించగా నాదర్‌గుల్ స్కూల్ మొదటి బహుమతి దక్కించుకుంది. ఈ క్రమంలో శనివారం నాదర్‌గుల్ జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెడ్మాస్టర్ సత్తయ్య సహస్ర, ప్రభాస్‌లను అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యనారాయణ, బీరప్ప, శ్రీదేవి, గీతాంజలి, అమృత, గీత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ మెంబర్ సుజాతానాయక్‌కు సన్మానం

చంపాపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ ప్రతినిధులు శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన స్థానిక కార్పొరేటర్ సుజాతానాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌యాదవ్, కోశాధికారి రాహుల్‌సాగర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

● 15కిలోల వెండి ఆభరణాల అపహరణ


సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న ఆలయంలో చోరీ చేసిన దుండగుడి ఫొటో

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలోకి ప్రవేశించిన దుండగుడు 15కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని మంగళ, శనివారాల్లోనే తెరుస్తారు. అయితే మంగళవారం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు శ్రీరంగం శ్రీనివాస్ తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి చొరబడి స్వామి వారికి చెందిన 15కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. కాగా శనివారం ఉదయం ఆలయాన్ని తెరిచి లోపలికి వెళ్లి చూడగా స్వామివారి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే గ్రామస్థులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఒక వ్యక్తి ముఖానికి మాస్కు ధరించి ఆలయంలోకి వెళ్లి ఆభరణాలను ఎత్తుకెళ్లిన దృశ్యాలను గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటపాత్రలు అందజేస్తున్న అనిల్‌యాదవ్

అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలకు మాజీ కార్పొరేటర్ వంట పాత్రలు వితరణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 16వ డివిజన్‌లో గల పాష్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు దీన్‌దయాల్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు అవసరమైన వంట పాత్రలను మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ అందజేశారు. శనివారం ఆయన ఆయా కేంద్రాలను సందర్శించి అక్కడి మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సదరు పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌యాదవ్ మాట్లాడుతూ చిన్నారులకు వంట చేసేందుకు సరైన పాత్రలు(పెద్ద గిన్నెలు) లేక నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులు గమనించి వారికి అవసరమైన పాత్రలు అందజేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ మేకల యాదగిరి, దీన్‌దయాల్‌నగర్ పాఠశాల హెడ్మాస్టర్ మంజుల, ఉపాధ్యాయులు శశికళ, వింధ్య, అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు రూప, ఆయాలు మంజుల, పార్వతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


తుర్కయంజాల్ సహకార సంఘం అధికారులతో సమావేశమైన కేరళ సహకార సంఘం అధికారుల బృందం

తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించిన కేరళ సహకార బ్యాంకు ప్రతినిధులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని శనివారం కేరళ సహకార బ్యాంకు ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా సహకార సంఘం రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోహెడాలో జరుగుతున్న గోదాంలను, కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలను, బీఎన్‌రెడ్డినగర్, తొర్రూర్‌శాఖ కార్యాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేరళ స్టేట్ బ్యాంకు వైస్ చైర్మన్ ఎంకే కన్నన్, అధికారులు సునీత సహదేవన్, పిళ్లై, నారాయణన్, శైలజ, తుర్కయంజాల్ సహకార బ్యాంకు సీఈవో రాందాసు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారితో అమిక మధ్యవర్తిత్వ కేంద్రం అధ్యక్షురాలు జ్యోతిరావు

కుటుంబ తగాదాలు మధ్యవర్తిత్వంతోనే పరిష్కారం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలు తీర్పడంలో మధ్యవర్తుల పాత్ర పూజ్యనీయమైనదని, అనేక కుటుంబ తగాదాలు మధ్యవర్తిత్వంతోనే పరిష్కారమయ్యాయని అమిక మధ్యవర్తిత్వ కేంద్రం అధ్యక్షురాలు జ్యోతిరావు పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్ కాలనీలోని అమిక ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ కౌన్సిల్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 40గంటల మధ్యవర్తిత్వ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ముగింపు సభలో జ్యోతిరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు వారి మధ్యవర్తిత్వ ప్రాజెక్టు కమిటీ ఆదేశాల మేరకు తాము శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో వివిధ రంగాలలో నిపుణులైన వారు పాల్గొని మధ్యవర్తిత్వంపై తర్ఫీదు పొందగా వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు.

మంటలు అంటుకొని ఇద్దరు బాలికలకు గాయాలు

● ప్రమాద స్థలంలో పెట్రోలు ఉండటంపై పలు అనుమానాలు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి.): ప్రమాదవశాత్తు పెట్రోల్‌పై నిప్పుపడి ఇద్దరు మైనర్ బాలికలు గాయాలపాలైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లోని కృష్ణానగర్‌లో నివసిస్తున్న బీహార్‌కు చెందిన జంగ్ బహదూర్‌కు ఇద్దరు కుమార్తెలు. గుల్షన్(11), ఆప్షన్(10) శనివారం అదే ప్రాంతానికి చెందిన తమ స్నేహితుడు సాహెన్(11)తో కలిసి సమీపంలో పార్కు వద్ద ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో సాహెన్ తన వద్ద ఉన్న అగ్గిపెట్టితో నిప్పంటించగా, ఆ ప్రాంతంలో అప్పటికే పెట్రోల్ పడి ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు బాలికలకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. కాగా ఇద్దరు బాలికలకు 30 శాతం మేర గాయాలైనట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు మైనర్లే కావడంతో వాళ్లు ఆడుకుంటున్న ప్రదేశంలోకి పెట్రోల్ ఎలా వచ్చింది, ఆ బాలుడు తన వెంట అగ్గిపెట్టె ఎందుకు తెచ్చుకున్నాడు అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలంలో ముగ్గురు ఉండగా, కేవలం ఇద్దరు బాలికలకు మాత్రమే గాయాలవడం ప్రశ్నార్థకంగా మారింది. జరిగిన ఘటనపై మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసు విచారణ పూర్తయితేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.